సాదుం జయరాం కథలు

# 11

# ఓడిపోలేదు

ఆనందరావు ఆఫీసునుంచి వచ్చీరాంగానే “మరొక యిల్లు ఎక్కడైనా చూడండి. ఈ యింట్లో నేనుండలేను” అన్నది విమల.

“ఏం ఈ యింట్లో భూతాలున్నాయా?”

“భూతాలంటే నాకు భయంలేదు. మనుషులంటేనే చచ్చేంత భయం” అన్నది విమల.

“ఏం మనుషులు?” అన్నాడు ఆనందరావు.

“ఆ వివరాలన్నీ ఎందుకు? చెప్పినట్టు చేస్తారా?” అన్నది నిగ్గతీసి.

“ఈ ఇల్లు ఎందుకు వదలాలంటున్నావో నాకు అర్థం కావడం లేదు. అసలే ఈ వూళ్ళో అద్దె యిళ్ళకు యమ యాతనగా వుంది. ఉద్యోగమన్నా సంపాదించుకోవచ్చునేమో గాని అద్దె యిల్లు సంపాదించడం మట్టుకు సాధ్యం కాదు. లక్షణంగా వున్నయిల్లు, ఆ మాటకొస్తే మనకి అచ్చివచ్చిన యిల్లు కూడాను. ఇక్కడికి వచ్చాకనే ఇద్దరికి తోడు మరో యిద్దర్ని బిడ్డల్ని కన్నావు. నాకు రెండు ఇంక్రిమెంట్లు వచ్చాయి” అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

“మీకు యేం చెప్పినా తమాషాగానే వుంటుంది” అన్నది విమల మూతి బిగించి.

“ప్రతిదాన్ని సీరియస్‌గా తీసుకుంటే మనం బ్రతకగలమా?”

"అదికాదండీ ఇరుగూ పొరుగూ కొత్తవాళ్ళు వచ్చారు. వాళ్ళేమో బాగా వున్నవాళ్ళు. వాళ్ళమధ్య ఉండటం ముళ్ళమీదున్నట్టు ఉంటుంది. మీరు చెబితే వినిపించుకోరు. నా అవస్థ మీకు తెలీదు" అన్నది విమల బాధగా.

"బాగానేవుంది. ఈ ఇల్లు విడిచి మరొక చోటికివెళ్తే ఇట్లాంటివారు అక్కడమాత్రం తగలరని నమ్మకమేమిటి?" అన్నాడు ఆనందరావు.

"మీరు అన్నిటికీ అన్నీ చెబుతారు. ఇక నేనేం మాట్లాడేది?"

"ఏమీ మాట్లాడనవసరంలేదు. పారిపోయి దేన్నించీ తప్పించుకోలేం. దేన్నయినా ధైర్యంగా ఎదుర్కోవడం నేర్చుకోవాలి?" అన్నాడు ఆనందరావు.

"చెప్పడం సులభం" అన్నది విమల.

ఆత్మవిశ్వాసం వుంటే చెయ్యడంకూడా సులభమేనని చెప్పాలనుకున్నాడు. కానీ ఆనందరావు చెప్పలేదు. ఆడవాళ్ళతో వాదించి లాభంలేదు తమకున్న బలహీనతల్ని వాళ్ళు అందరిలోనూ చూస్తారు - పరువు ప్రతిష్టల్ని, డబ్బు హోదా వీటితో కలిపి చూడటం తప్ప విడిగా చూళ్ళేరు. డబ్బు హోదా లేనంతమాత్రాన మనిషి ఎందుకు కుంచించుకుపోవాలో ఆనందరావుకు అర్థం కాలేదు. డబ్బూ హోదా వున్నవాళ్ళని చూచి భయపడటం ఎందుకో అంతకన్నా అర్థం కాలేదు.

నిజానికి విమల ఈ యిల్లు ఎందుకు వదలాలనుకుంటున్నదో ఆనందరావుకు తెలుసు. ఈమధ్యనే ఇరుగూ పొరుగూ కొత్తవాళ్ళు వచ్చి చేరారు. ఆ వచ్చినవాళ్ళు కాస్త కలిగినవాళ్ళని కూడా ఆనందరావుకు తెలుసు. వాళ్ళయినా విమలని బెదరగొట్టలేదు. తన నీడను చూచి తానే బెదురుకుంటున్నది, ఆ విషయం తను గమనించాడు. వారం క్రిందట పక్కింటామె వచ్చింది.

ఆమె భర్తకి యేదో పెద్ద ఉద్యోగమే. అయినా ఆమెలో అహంకారంలాటి అవగుణాలేవీ వున్నట్టులేవు. తనంతట తానే వచ్చింది. "వచ్చీరాంగానే యేం చేస్తున్నారమ్మా" అంది.

"వంటయిపోయింది. యేంతోచక వూరికే కూర్చున్నాను. రండి" అని విమల ఆహ్వానించింది.

"బాగుంది. యేంచేశారు వంట?" అంది యధాలాపంగా.

"పప్పు, తాళింపు పచ్చడి......."

విమల చదువుతోన్న దండకం వింటుంటే ఆనందరావుకి నవ్వు వచ్చింది. తాళింపులూ పచ్చళ్ళూ, తన జీవితం నుంచి ఎప్పుడో తప్పుకున్నాయి. తప్పుకున్నవి మాటల్లో దొర్లుతున్నాయి.

పై స్థాయివాడితో తక్కువస్థాయివాడు పోటీ పడబోతే అబద్ధాలూ, ఆడంబరాలూ తప్పవు. ఆవిడ అర్థగంటసేపుంది. అర్థగంటలో విమలచేత అరడజను అబద్ధాలు చెప్పించింది. విమల దృష్టిలో అవన్నీకూడా ప్రతిష్టను కాపాడే అబద్ధాలు.

అంతా ఆనందరావు విన్నాడుగాని "ఇట్లా అబద్ధాలు చెప్పవలసిన అవసరం యేముంది?" అని విమలతో అనలేదు. అంటే పట్టుబడ్డ దొంగలా బాధపడుతుంది. ఉన్న విషయాలని కప్పిపుచ్చుకోవటానికి అబద్ధాలు చెప్పడమనేదే బాధాకరమైన విషయం. అవి బయటపడటం - ఎవరి ముందయినా సరే - మరీ బాధకల్గిస్తుంది. అందుకని విననట్టే గమ్మున వున్నాడు. ఎటూ ఈరోజు యింటి ప్రసక్తి వచ్చింది గనుక, విమలతో కొన్ని విషయాలు చెప్పడం మేలేమో ననిపించింది ఆనందరావుకు.

"విమలా ఒక విషయం చెప్పనా? అన్నాడు ఆనందరావు.

"చెప్పండి" అన్నది విమల.

"దరిద్రం అనుభవించడంలో బాధవుంది. ఒప్పుకుంటాను. కానీ, దాన్ని దాచాలనిచేసే ప్రయత్నం వుందే - అది ఇంకా బాధాకరమైంది, హేయమైంది" అన్నాడు.

ఆనందరావు దేని విషయం ప్రస్తావిస్తున్నాడో, తెలుసుకోగల ఇంగితం విమలకుంది. ఆమె ఏ సమాధానం చెప్పలేదుకాని ఒక నిట్టూర్పు విడిచి వూరుకుంది. విమల ఇంటి విషయం ఎత్తలేదు.

వారం రోజుల తర్వాత ఒక ఆదివారం ఆనందరావు ఇంట్లోనే వున్నాడు. పక్కింటావిడ వచ్చింది. వాళ్ళ సంభాషణని ఆనందరావు వింటూనే వున్నాడు.

"మీ ఆయన ఉదయం యేదో బట్టల పాకెట్ తెచ్చినట్టుంది. కొత్తబట్టలు కొన్నారేమిటి?"

"అబ్బే అదేంలేదు. లాండ్రీనుంచి బట్టలు తెచ్చివుంటారు" అంటోంది విమల.

"లాండ్రీనా? చాకలివాడేమయ్యాడు?" అంది ఆమె,

"యేమన్నా కావడానికి చాకలివాడంటూ ఒకడుంటేనా?" ఆయనకున్నవి రెండు జతలు. ఒకటి ఒంటిమీదుంటే రెండోది లాండ్రీలో వుంటుంది. చాకలాడికి వేస్తే వాడు వారం రోజులుంచుతాడు. ఎట్లా కుదురుతుంది. నావి పిల్లలివి నేనే ఉతుక్కుంటాను" అన్నది విమల.

"పోనీలెండి ఎవరిపని వాళ్లు చేసుకుంటే తప్పేముంది?" అన్నది సమర్థిస్తూ పక్కింటావిడ.

"తప్పు ఒప్పుల సమస్యకాదు. అంతకన్నా గత్యంతరం లేదు మరి" అన్నది విమల.

"అన్నట్టు మీ అబ్బాయికి జ్వరమని విన్నాను. డాక్టరుతో మందో మాకో యేమైనా యిప్పిస్తున్నారా?"

"లేదండీ" అన్నది విమల.

"చీటికీ మాటికీ ఈ అలోపతి మందులు వాడితే రియాక్షనిచ్చి లేని జబ్బులు వస్తాయని మా ఆయన అంటూంటారు. వట్టి జ్వరమేగా రెండు రోజులుంటే అదే పోతుందులెండి" "అలోపతి మందులు రియాక్షనిచ్చేట్టయితే హెూమియోపతి మందులు వాడచ్చు విషయం అదికాదులెండి. నెలాఖరు, డబ్బుల్లేవు" అంది విమల.

ఇట్లా నడిచింది సంభాషణ విమల యేమీ దాచలేదు. కనీసం సమర్ధించడానికైనా ప్రయత్నించలేదు. కాసేపుండి పక్కింటావిడ వెళ్ళాక ఆనందరావు విమల దగ్గరికి వచ్చేడు.

విమల కళ్ళలో నీళ్లు పొరాడుతున్నాయి.

కన్నీళ్లెందుకు విమలా; నువ్వు ఓడిపోలేదు. విజయం సాధించావు. నాకు చాలా సంతోషంగావుంది" అంటూ ఆనందరావు విమలను దగ్గరికి తీసుకున్నాడు.

**- (2, ఫిబ్రవరి, 1970, విశాలాంధ్ర వారపత్రిక రష్యన్‌లోకి అనువాదం 1978)**